క్లుప్తంగా

జగన్నాథ స్వామి ఆరాధనోత్సవాలు



మాదాయిపల్లి బాలీశ్వరిమాత ఆశ్రమంలో పూజలో భక్తులు

తలకొండపల్లి: మాదాయిపల్లిలోని బాలీశ్వరి మాత ఆశ్రమంలో బుధవారం జగన్నాథ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వేద పారాయణం, సంకీర్తనలు, భజనలు, పురాణ పఠనం, గీత కావ్యాలు, తదితర పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శంరయ్యగౌడ్, కార్యవర్గ సభ్యుడు, భక్తులు, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న రమాకాంత్‌రెడ్డి తదితరులు

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చీదేడ్ గ్రామానికి చెందిన తోడే ప్రభాకర్ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.33 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో ప్రజలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలేశ్, శేఖర్‌రెడ్డి, మహేందర్, అనిల్, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి



మాట్లాడుతున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడలను ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్‌లో బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చెన్నకేశవరెడ్డి, పీడీ భాస్కర్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, జోనల్ పీఈటీలు సుశీల, విజేయేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి



పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తున్న శబరి

కడ్తాల్: ప్రతిరోజు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డమీదితండా గ్రామ పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలలో భాగంగా బుధవారం మహిళలకు, చిన్నారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ విటమిన్లు, ప్రోటీన్లు, కొవ్వులు, నీరు, కార్బొహైడ్రేట్లు తదితర పోషకాలు శరీరానికి అవసరమన్నారు. ముఖ్యంగా పిల్లలకు పోషకాహారం ఎంతో అవసరమని సూచించారు. మానసిక శారీరక ఎదుగుదలకు, ఎముకల పటుత్వానికి పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కళావతి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సహజసిద్ధ నాలాలను పరిరక్షించాలని వినతి

శంకర్‌పల్లి: మోకిల గ్రామంలోని సహజసిద్ధ నాలాలను పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందించారు. మోకిల గ్రామ ప్రణాళికలోని నాలాలను లా పలోమా విల్లాల యజమాని కబ్జా చేసి విల్లాలు నిర్మించాడని, దీంతో నాలా ద్వారా వచ్చే నీళ్లు తమ పొలాల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించి నాలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇళ్లు కూలిపోయిన బాధితులకు చెక్కులు అందజేత



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: భారీ వర్షాలతో తెగిపోయిన చెరువులు, కుంటలు, దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు దక్షిణభాగం పనుల నిర్వహణలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం మంజూరుచేసిన పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సురసముద్రం చెరువును అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలోని మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మేడిగడ్డతండా సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కత్వవాగును, అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కల్వకుర్తి నియోజకవర్గంలోని అనేక చెరువులు, కుంటలు నిండి ప్రవహిస్తున్నాయని చెప్పారు. పలు చెరువులకు గండ్లు పడ్డాయని, ఆయా చెరువుల వద్ద తాత్కాలికంగా గండ్లను పూడ్చివేయించామన్నారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ విజయ్, మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్, ఖలీల్, బల్‌రాం, కృష్ణనాయక్, శ్రీకాంత్, ఫరీద్, రామకృష్ణ, అప్పం శ్రీను, ప్రసాద్, గాజుల శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పలు వార్డుల్లోని రైతులు నేరుగా విచ్చేసి తమ కుటుంబ సభ్యుల వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. రూ.2లక్షల లోపు రుణాలున్న రైతులందరికీ మాఫీ చేశామన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి మాఫీ కాలేదన్నారు. అందుకే అధికారులు గ్రామాలకే వెళ్లి రైతులనుంచి అవసరమైన సమాచారాన్ని, ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈఓ శ్రవణ్‌కుమార్, చాణక్యలతో పాటు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

రైతును రాజుగా చేయడమే లక్ష్యం

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి



కోదండరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

యాచారం: రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం పలువురు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రుణమాఫీ కాలేదని, ధరణి పోర్టల్ వల్ల భూములు రికార్డుల్లో నమోదు కావడం లేదని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని పలు గ్రామాల రైతులు కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నాడన్నారు. గతంలో పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో భూములు కోల్పోయిన రైతులు నిరాశ్రయులుగా మారినట్లు గుర్తు చేశారు. త్వరలో రెవెన్యూ వ్యవస్థలో మార్పులు తెస్తామన్నారు. ఈ విధానంతో రైతులకు మేలు కలిగేవిధంగా రికార్డులు తయారు చేస్తామన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

ఎంఈఓ సర్దార్‌నాయక్



ఆమనగల్లు: పోలెపల్లి పాఠశాలలో విద్యార్థిని బోర్డుపై చదివిస్తున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ఆమనగల్లు: ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆమనగల్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ సూచించారు. మండలంలోని పోలెపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రిజిస్టర్లను ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు స్టాక్‌రూమ్‌లో ఉన్న వంటసామగ్రి, కూరగాయలు, వంటగది, స్నానాల గదులను ఆయన చూశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



తలకొండపల్లి: పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ముత్యాలు, శ్రీకాంత్ తదితరులు

తలకొండపల్లి: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఏ గ్రేడ్ వచ్చే విధంగా తీర్చి దిద్దాలని మండల ప్రత్యేకాధికారి ముత్యాలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) బుధవారం ఎంపీడీవో శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల హాజరు శాతంతో పాటు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, మెనూ, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, స్టోర్ రూం, డైనింగ్ రూం, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి ముత్యాలు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. విద్యార్థులు ఏ రోజుకారోజు పాఠాలను శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అర్థం కానీ విషయాలను ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: హెచ్ఎండీఏలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం హెచ్ఎండీఏ కమిషనర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. అర్బన్ ఫారెస్టులో పని చేస్తున్న వారికి ఎఫ్ఎస్ఆర్ రేట్ల ప్రకారం జీతాలు చెల్లిస్తామని చెప్పి 20 సంవత్సరాలు గడుస్తున్నా వారికి వేతనాలు పెంచడం లేదన్నారు. జీవో నెంబరు 60 అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, కీసరి నర్సిరెడ్డి, ఎల్లయ్య, భిక్షపతి, ఎల్లయ్య, రాములు, ఎల్లమ్మ, కుమార్, నర్సింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూపాల్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ మాధవ రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ మాధవ రెడ్డి

తుర్కయంజాల్: విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ మాధవ రెడ్డి ఉద్యోగులకు సూచించారు. బుధవారం ఆయన తుర్కయంజాల్‌లోని డీఈ కార్యాలయం, ఇఆర్‌ఓను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఫోన్ కాల్స్‌కు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలన్నారు. గణేశ్ నిమజ్జనం సజావుగా పూర్తయ్యేందుకు సహకరించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో డీఈ పి యాదగిరి, ఎస్ఏఓ శేఖర్ రెడ్డి, ఏఓ వినోద్ రెడ్డి, ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈలు రాములు, విద్యారాణి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్ నేతృత్వంలో హైదరాబాద్ కామినేని హస్పిటల్, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 252 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్, తదితర తాత్కాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత నీటి నివారణకు క్లోరినేషన్ లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ లలిత, మాజీ ఎంపీటీసీ సునీత, ఆంజనేయులు, నిరంజన్, టెంపుల్ చైర్మన్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావద్దు

ఎస్ఐ నాగరాజు

ఇబ్రహీంపట్నం: చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె. భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ వద్దు-ఆరోగ్యమే ముద్దు అనే అంశంపై ఇబ్రహీంపట్నం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్ నేటి విద్యార్థి, యువతపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థుల మేధస్సు, ఆలోచనలు సమాజ అభివృద్ధివైపు ఉండేవిధంగా చదువుకోవాలన్నారు. నేడు సమాజంలో యువత, విద్యార్థులు వివిధ వ్యసనాలకు బానిస అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రతిఒక్కరికీ గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్, కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు జంగయ్య, శ్రీకాంత్, వంశీ, తరంగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

ఆమనగల్లు: పట్టణంలోని రచ్చకట్ట వద్ద మార్కండేయ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జై భవానీ ఫ్రెండ్స్ యూత్ మండపం వద్ద..

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని జై భవానీ ఫ్రెండ్స్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. జైభవానీ ఫ్రెండ్స్ యూత్ వినాయక మండపం వద్ద డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సీఐ శివ ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, వడ్డేరాజు, చందోజీ, అశోక్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, లక్పతినాయక్, షాబుద్దీన్, మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, యాదయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో..

మైసిగండిలోని పెద్ద వినాయకుడి వద్ద జాటవత్ జవహర్‌లాల్ ప్రేమ దంపతుల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు.



ఆమనగల్లు: గణనాథుని పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



యాచారం: మాల్‌లో వినాయకుడి పూజలో గ్రామస్తులు



కడ్తాల్: అన్నదానం ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శివప్రసాద్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన నిధానకవి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నర్సింహ, వెంకటేశ్, యాదగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్